



గ్రామస్థులకు భాగవతం పుస్తకాలను అందిస్తున్న నారాయణరెడ్డి

తెలుగును కాపాడుకుందాం

భాషా ప్రేమికుడు నారాయణరెడ్డి

బెళుగుప్ప, జనవరి 15(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహితీ సంపదను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని నక్కలపల్లికి చెందిన రైతు నారాయణ రెడ్డి అన్నారు. ఆయన చదువుకున్నది 7వ తరగతి వరకే అయినా.. తెలుగు భాషా పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నారు. తెలుగు పద్యాలను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని ప్రోత్సహిస్తున్నారు. స్వగ్రామంలోని సీతారామ ఆలయంలో పోతన భాగవత సప్తాహం నిర్వహిస్తున్నారు. భాగవతం పుస్తకాలను ఉచితంగా పంచుతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కడప, కర్నూలు జిల్లాలకు చెందిన భాషా ప్రేమికులు ఈ వేడుకలలో పాలు పంచుకుంటున్నారు. తెలుగు పద్యాలు ప్రతి ఒక్కరి నోటా వినపడాలని, అందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నారాయణరెడ్డి అన్నారు.

వీఆర్‌కు కానిస్టేబుల్

అనంతపురం క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నారాయణస్వామిని వీఆర్‌కు పంపారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఇంతియాజ్ అహ్మద్‌ను చితకబాదిన వ్యవహారం వివాదాస్పదం కావడంతో ఎస్పీ జగదీష్ చర్యలు తీసుకున్నారు. జరిగిన ఘటనపై మేయర్ మహమ్మద్ వసీంతో కలిసి బాధితుడు అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సమగ్ర విచారణ జరపాలని డీఎస్పీని ఆదేశించారు. విచారణ అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని ఎస్పీ తెలిపారు.

సమగ్రశిక్ష ఏపీసీగా శైలజ

అనంతపురం విద్య, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ప్రాజెక్టు ఏపీసీగా శైలజ నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె డ్వామాలో ఏపీడీగా పనిచేస్తున్నారు. జిల్లాలో కొంతకాలంగా ఏపీసీ పోస్టు ఖాళీగా ఉంది. ఇటీవల పలు జిల్లాలకు ఏపీసీలను నియమించారు. మిగిలిన నాలుగు జిల్లాలకు ఈనెల 14న ఏపీసీలను నియమించారు. ఏపీసీ శైలజ డ్వామా నుంచి రిలీవ్ అయిన తర్వాత కలెక్టర్‌ను కలసి విధుల్లో చేరే అవకాశం ఉంది.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సుప్రియ, జ్యోతిక

శెట్టూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ నెల 11, 12 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 41వ అంతర్ జిల్లా జూనియర్ టెన్నికాయిట్ పోటీలలో జిల్లా విద్యార్థులు సత్తా చాటి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న శెట్టూరు విద్యార్థిని జి.సుప్రియ బాలికల విభాగంలో మొదటి స్థానంలో నిలిచింది. కనుకూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జ్యోతిక ఐదో స్థానంలో నిలిచింది. వీరు ఫిబ్రవరిలో చెన్నైలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

ఊరంతా సంక్రాంతి

పల్లెలు.. పట్టణాల్లో సందడి.. **సంప్రదాయ పోటీలతో సంబరాలు**

సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి పండుగ సెలవులను ఆనందంగా గుడుపుతున్నారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడినవారు స్వస్థలాలకు చేరుకోవడంతో పల్లెలు, పట్టణాలకు కొత్త కళ వచ్చింది. ముగ్గుల పోటీలు, కోడి పందేలు, రాతి దూలం లాగే పోటీలు.. ఇలా ఎక్కడ చూసినా సందడి కనిపిస్తోంది. ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, రైతులు, కూలీలు.. ఇలా అన్ని వర్గాలవారు సంబరాలలో మునిగితేలారు. విద్యాసంస్థలకు సెలవులు ఉండటంతో చిన్నారులు ఆటపాటలతో గడపుతున్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

వెంకటాపురంలో వేడుకలు

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత స్వగ్రామం వెంకటాపురంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పోటీ పడి వీధులను రంగు రంగుల ముగ్గులతో నింపేశారు. మొదటి మూడు స్థానాలలో నిలిచినవారికి విలువైన స్మార్ట్ ఫోన్‌లను ఎమ్మెల్యే బహూకరించారు. నాలుగు, ఐదు, ఆరు స్థానాలలో నిలిచినవారికి నగదు బహుమతులను అందజేశారు. పోటీల్లో పాల్గొన్న అందరికీ కానుకలను అందజేశారు. టీడీపీ నాయకులు ధర్మవరపు బాలాజీ, రామ్మూర్తినాయుడు, సుధాకర్, శ్రీధర్‌నాయుడు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, రామగిరి



ముగ్గులను పరిశీలిస్తున్న జేసీ కుటుంబ సభ్యులు

స్వామివారి సన్నిధిలో రంగవల్లికలు

తాడిపత్రి: బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జేసీ కుటుంబం బుధవారం ముగ్గుల పోటీలను నిర్వహించింది. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, ఆయన సతీమణి నిఖిలారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తదితరులు ముగ్గులను పరిశీలించారు. మొదటి బహుమతి రూ.16 వేలు, రెండో బహుమతి టీవీ, మూడో బహుమతి కూల్ వాటర్ క్యాన్, నలుగురికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామాంజనేయులు, సభ్యులు చందు, చంద్రశేఖర్, శేషఫణి తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు అదనపు జడ్జిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ఇలవేల్పు సన్నిధిలో జస్టిస్ చల్లా గుణరంజన్

హైకోర్టు అదనపు జడ్జి జస్టిస్ చల్లా గుణరంజన్ సంక్రాంతికి సొంతూరికి వచ్చారు. సతీమణి విజిత, సోదరుడు, ఆదాయ పన్నుశాఖ ట్రిబ్యునల్ సభ్యుడు నాగేంద్రప్రసాద్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇలవేల్పు జంబులపాడు లక్ష్మీనరసింహస్వామిని బుధవారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం రామాలయం, గంగమ్మ ఆలయాలను సందర్శించి, పూజలు నిర్వహించుకున్నారు. తన సొంతూరు చల్లావారిపల్లికి వెళ్లి బంధుమిత్రులను పలకరించారు. జంబులపాడులో ఆయనకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. జంబులపాడు మాజీ సర్పంచు ప్రభాకర్‌నాయుడు, గన్నెవారిపల్లి మాజీ సర్పంచు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చింబిలి ప్రసాద్‌నాయుడు తదితరులు గ్రామస్థులతో కలిసి పూలబాటలో నడిపించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గ్రామస్థులందరిని జస్టిస్ గుణరంజన్ ఆప్యాయంగా పలకరించారు. వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. గ్రామస్థులు ఆయనను పూలమాలలు, శాలువాతో సత్కరించారు. రాజా, చల్లా సూరి, గిరి, రవిచంద్ర, వెంకటనాయుడు, ఎల్. నాగరంగయ్య, జనార్దన్‌నాయుడు, లక్ష్మినారాయణ, సుబ్బయ్యచౌదరి, అశ్వర్థనారాయణ, నాగరాజు, రాము, క్రిష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

- తాడిపత్రి



స్వామివారిని దర్శించుకుంటున్న జస్టిస్ గుణరంజన్

సైరా..

కూడేరు మండలం జల్లిపల్లిలో బుధవారం రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన చెన్నప్ప ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.30 వేల బహుమతిని అందుకున్నాయి. బళ్లారి జిల్లా ఆంద్రోల్ గ్రామానికి చెందిన ఆనంద రెడ్డి ఎద్దులు ద్వితీయ బహుమతి రూ.20 వేలు, అనంతపురం నగరానికి చెందిన ఓబులపతి ఆచారి ఎద్దులు మూడో బహుతి మూడో బహుమతి రూ.10 వేలు గెలుచుకున్నాయి.

-కూడేరు



రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

సొంతూరిలో సంబరాలు

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తన స్వగ్రామం, శింగనమల మండలం ఆలంకరాయునిపేటలో కుటుంబ సభ్యులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. హోదాను పక్కనపెట్టి గ్రామస్థులతో కలిసిపోయారు. స్కూటర్ ఎక్కి ఊరంతా తిరిగారు. గ్రామస్థుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. గ్రామ సమస్యల పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. యువకులతో కలిసి కాసేపు క్రికెట్ ఆడారు. గోళీలు, వాలీబాల్ ఆడుతూ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు.

- శింగనమల



క్రికెట్ ఆడుతున్న ఎంఎస్ రాజు



● సంక్రాంతి వేదికగా కలిసిన పూల అంజినయ్య కుటుంబ సభ్యులు

ఇది కదా పండుగ

విడపనకల్లు మండలం పొలికి గ్రామంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో 'పూల'వారి కుటుంబం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రెండు దశాబ్దాల తరువాత ఏకంగా 85 మంది రక్త సంబంధీకులు సొంతూరిలో పండుగ చేసుకోవడం దీనికి కారణం. గ్రామానికి చెందిన పూల అంజినయ్య, సాలమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు. ఇద్దరు కూతుళ్లకు వివాహం జరిగి.. అత్తారిళ్లకు వెళ్లిపోయారు. కొడుకుల్లో బొలికొండ, వెంకటస్వామి పాతికేళ్ల క్రితం కసాపురం వెళ్లి స్థిరపడ్డారు. మిగిలిన ఇద్దరు కొడుకులు నెట్టికల్లప్ప, రంగస్వామి సొంతూరిలోనే కలిసి ఉంటున్నారు. నెట్టికల్లప్పకు నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు. రంగస్వామికి నలుగురు కొడుకులు, ఒక కూతురు. కాలక్రమంలో వీరందరూ వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి స్థిరపడ్డారు. ఒక ఇంట్లో పుట్టి పెరిగినా.. పలకరింపులు కూడా తగ్గిపోయాయి. ఆ కుటుంబంలో ఒక యువకుడికి ఈ పరిస్థితి బాధ కలిగించింది. అందరూ ఒక్కసారైనా కలుసుకుంటే బాగుంటుందని ప్రయత్నాలు ప్రారంభించారు. సంక్రాంతి వేదికగా సొంతూరికి తిరిగొచ్చారు. ఇంతకంటే పండుగ ఇంకేముంటుంది..?

- ఆంధ్రజ్యోతి, విడపనకల్లు



●పూలవారి ఇంట.. సంక్రాంతి సంప్రదాయ వంటలు



బంగారు బుల్లోడు

విద్యాశాఖలో గోల్డ్‌మ్యాన్..!

- ప్రైవేటు విద్యాసంస్థల్లో వివాదాలే వనరులు
- విద్యార్థి నాయకులను ఉసిగొల్పి బేరసారాలు
- కాసులు వద్దు.. కనకపు ఆభరణాలే ముద్దు..!

అనంతపురం విద్య, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బంగారం అంటే ఇష్టపడనివారు ఉంటారా..? ఉన్నవారు, లేనివారు అనే తేడా లేకుండా.. అంతో ఇంతో బంగారాన్ని పోగేసుకుంటారు. గజదొంగలో గోల్డ్ మ్యాన్ ఎన్టీఆర్ నుంచి కేజీఎఫ్‌లో రాకీ భాయ్ వరకూ బంగారాన్ని పోగేసుకున్నవారే కదా..! అంత కాకపోయినా, వారి బాటలో నడుస్తున్నారు విద్యాశాఖలో ఓ గోల్డ్ మ్యాన్..! 'డబ్బులు ఊరికే రావు..' అనే ప్రకటన బాగా చూశారో ఏమో.. 'డబ్బులు వద్దు.. గోల్డ్ చైన్.. ఉంగరం.. ఏదో ఒకటి ఇవ్వండి..' అని అడిగి మరీ తెప్పించుకుంటారు. కానుకగా స్వీకరిస్తున్నారు. ఆయన కానుకల వ్యవహారం శృతిమించడంతో బాధితులు విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కాలు పెట్టాడంటే కనకమే..

జిల్లా విద్యాశాఖలో డివిజన్ స్థాయిలో పనిచేస్తున్న ఆ అధికారి పాఠశాలల తనిఖీలకు వెళితే చుక్కలు చూపిస్తారట. నిబంధనల పేరిట బెదిరించి దారికి తెచ్చుకుంటారట. అంతో ఇంతో డబ్బులు ఇవ్వబోతే.. వద్దు.. బంగారం కావాలని అడుగుతారట. ఆయనకు బంగారం అంటే భలే ఇష్టమని చెబుతున్నారు. కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల నుంచి కనక వస్తువులను కానుకగా తీసుకుంటున్న ఆయన.. వారి దృష్టిలో 'బంగారు బుల్లోడు'గా మారిపోయారు. ఈ నెల 24న విద్యాశాఖ కమిషనర్ జిల్లాకు వస్తున్నారు. బంగారు బుల్లోడి ఆగడాల గురించి ఆయనకు ఫిర్యాదు చేయాలని ప్రైవేట్ పాఠశాలల సంఘం, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు కొందరు సిద్ధమైనట్లు సమాచారం.

నిఘా వేసి..

తన మాట వినని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై ఆ అధికారి నిఘా వేస్తారట. ఏ చిన్న అవకాశం దొరికినా తానే ఫిర్యాదులు పెట్టిస్తారట. తనకు అనుకూలంగా ఉండే కొన్ని విద్యార్థి సంఘాల నాయకులను ఉసిగొల్పి.. రంగంలోకి దింపుతారట. తన ప్లాన్‌లో భాగంగా, తన పరిధిలోని స్కూళ్లపై ఫిర్యాదులు రాగానే విచారణకు వెళతారట. ఇక అంతే..! గోడకు చిన్నపాటి క్రాక్ కనిపించినా, కిటికీ దెబ్బతిన్నా, టాయిలెట్ల తలుపులకు నట్లు ఊడినా, పాఠశాల ముందు రోడ్డుపై జీబ్రా క్రాస్ లేకపోయినా వారికి మూడినట్లే అంటున్నారు. నిబంధనలన్నీ వివరించి.. వాటన్నింటినీ అతిక్రమించారని హెచ్చరికలు జారీ చేస్తారు. ఓ నెలరోజులపాటు తన కార్యాలయం చుట్టూ తిప్పించుకుని.. దారికి తెచ్చుకుంటారట. ఇది ఒక దారి. ఇంకోటీ ఉంది..!

● పాఠశాలలో అనుకోని సంఘటన ఏదైనా జరిగితే వెంటనే వాలిపోతారు.



ఉదయం 6 గంటలకే కరస్పాండెంట్లకు ఫోన్ చేస్తారు. 'ఏంటి.. ఏదో జరిగిందట కదా..? నాకు చెప్పకుంటే ఎలా..' అని గద్దిస్తారట. ఆ సమయంలో తన దారికి వస్తే సరి..! లేకుంటే తన పవర్ ఉపయోగించి ఎంక్వైరీ రుచి చూపిస్తారు. చేసేది లేక కొందరు సరెండర్ అవుతారు. ఆ వెంటనే సారు గొంతెమ్మ కోర్కెల చిట్టా విప్పుతారట. బంగారు గొలుసు వంటి ఏదో ఒక ఆభరణాన్ని కానుకగా తీసుకుంటారట. ఇది మరో రూటు..!

ఫిర్యాదులపై చర్యలేవీ..?

ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా నోట్ పుస్తకాలు, పాఠ్యపుస్తకాల విక్రయాలు జరుగుతున్నాయని గతంలో కొన్ని విద్యార్థి సంఘాలు ఆ అధికారికి ఫిర్యాదు చేశాయి. అక్రమాలకు ఆధారాలను కూడా చూపించాయి. ప్రత్యక్షంగా పట్టించాయి. అయినా ఆ అధికారి ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఆ అధికారికి అక్రమాలతో నిమిత్తం లేదని, ఏది జరిగినా తనకు అనుకూలంగా మార్చుకుని కనకపు కానుకలు పుచ్చుకుంటారని కొందరు విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతోనూ ఆయన దురుసుగా వ్యవహరిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇటు ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘాల నేతలు, అటు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్య సంఘాల నేతలు, విద్యార్థి సంఘాల నేతలు విద్యాశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు.

ఎప్పుడు కొంటారు..?

రైతుల ఇళ్లలో కంది దిగుబడులు

ఆర్ఎస్‌కేలలో రిజిస్ట్రేషన్లతో సరి



కొనుగోలు ప్రారంభించని మార్క్‌ఫెడ్ 7

కర్ణాటక మద్యంతో

దొరికిన వైసీపీ నాయకులు



కర్ణాటక మద్యం ప్యాకెట్లను చూపుతున్న పోలీసులు

శెట్టూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వైసీపీ నాయకులను ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. శెట్టూరు మండలం ఖైరేవు గ్రామానికి చెందిన గంగాధర, హనుమంతరాయుడు రెండు కేసుల కర్ణాటక మద్యాన్ని తెస్తుండగా మంగళవారం అరెస్టు చేశామని ఎక్సైజ్ ఇన్‌చార్జి సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మొత్తం 96 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేశామని, వారి ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

చెన్నేకొత్తపల్లి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త వడ్డే జయరాంపై వైసీపీ వర్గీయులు బుధవారం దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. జయరాం కియా అనుబంధ పరిశ్రమలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకుని ఇంటికి వెళుతుండగా, వైసీపీ వర్గీయులు మాడెం ఓబిరెడ్డి, ఆయన తమ్ముడు మాడెం ప్రకాశ్‌రెడ్డి, మనోహర్ రెడ్డి మాట్లాడే పని ఉందని పాల డెయిరీ వద్దకు తీసుకువెళ్లి చితకబాదారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

విషపు నీరు తాగి మూగజీవాల మృతి



ఆవులు, గొర్రెల కళేబరాలు

బ్రహ్మసముద్రం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నంజాపురం గ్రామ పొలాల్లో విషపు నీరు తాగి మూడు ఆవులు, 26 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. పైరుకు పిచికారీ చేసేందుకు పొలంలో నీటితొట్టిలో రైతు రసాయనాలను కలిపాడు. పొరపాటున ఆవులు, గొర్రెలు ఆ నీటిని తాగాయి. గోపాల మిత్ర గోవిందు, హరి అక్కడికి వెళ్లి పరిశీలించారు. వైద్యాధికారి సలహామేరకు చికిత్స చేసినా ఫలితం దక్కలేదు. మూగజీవాల మృతితో రైతు కెంచప్పకు రూ.3.56 లక్షలు, ఎర్ర కొండాపురం గ్రామానికి చెందిన జయన్నకు రూ.36 వేలు నష్టం జరిగిందని పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చూడాలని పశువైద్యాధికారిని కోరారు.

హెచ్చెల్సీలో యువకుడి గల్లంతు

అనంతపురం క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కాలువలో పడిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. నగరంలోని నీరుగంటి వీధికి చెందిన సాయి శశాంక్ రెడ్డి(28) బీటెక్ పూర్తి చేసి, ఖాళీగా ఉంటున్నాడు. తన స్నేహితుడు కౌశిక్‌తో కలిసి బుధవారం మధ్యాహ్నం మద్యం సేవించాడు. అనంతరం ఇద్దరూ కలిసి సుఖ్‌దేవ్ నగర్‌కు వెళ్లి.. హెచ్చెల్సీ గట్టుమీద కూర్చున్నారు. కాసేపటికి మరో స్నేహితుడు శ్రీకాంత్‌రెడ్డి వారిని కలిశాడు. ఆ తరువాత ఏం జరిగిందో తెలియదుగాని, సాయి శశాంక్‌రెడ్డి కాలువలో పడి కొట్టుకుపోయాడని సాయంత్రం 4.30గంటల సమయంలో స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. తొలుత త్రీటౌన్ పోలీసులు వెళ్లారు. ఘటన జరిగినది తమ పరిధి కాదని ఫోర్త్‌టౌన్ పోలీసులకు తెలియజేశారు. వారు గాలింపు చర్యలు చేపట్టారు.

రెండు ప్రాంతాల్లో ప్రమాదాలు

ఒకరి మృతి.. ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో బోయ సంజీవప్ప (వృత్తంలో), బోయ ఈరన్న

పెనుకొండ రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రెండు ప్రాంతాల్లో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా.. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. రొద్దం మండలం ఎం.కొత్తపల్లికి చెందిన బోయ సంజీవప్ప(54), బోయ ఈరన్న ద్విచక్రవాహనంలో పెనుకొండకు వెళుతూ ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి మట్టిదిమ్మెను ఢీకొట్టింది. దీంతో బోయ సంజీవప్ప తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఈరన్నను పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరికి గాయాలు..

రొద్దం మండల కేంద్రానికి చెందిన చాంద్ బాషా, వంశీ ద్విచక్రవాహనంలో కర్నాటకకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. వీరు ప్రయాణిస్తున్న బైకు మలుపువద్ద అదుపుతప్పి కిందపడింది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వంశీని మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఈ ప్రమాదాలపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చౌడమ్మకు జ్యోతులు

తొగటవీర క్షత్రియుల అగ్నిగుండ ప్రవేశం

వేలాదిమంది భక్తులతో పోటెత్తిన ధర్మవరం



చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవంలో పాల్గొన్న కదిరి ఎమ్మెల్యే కందికుంట, పరిటాల శ్రీరామ్



జ్యోతులతో పరిటాల శ్రీరామ్, సంధా రాఘవ

ధర్మవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొగటవీర క్షత్రీయ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం పట్టణంలోని పలు వార్డులలో జ్యోతులు, కలశాలను ఊరేగించారు. మొత్తం 39 కమిటీలు ఒక్కటిగా చేరి అర్ధరాత్రి నుంచి అమ్మవారికి జ్యోతులను సమర్పించారు. మేళతాళాల నడుమ నాట్యమాడుతూ మంగళవారం తెల్లవారుజాము వరకూ వేడుకలు నిర్వహించారు. ఆ తరువాత దుర్గమ్మగుడి వద్దకు చేరుకుని హోమగుండం ప్రవేశం తరువాత ఆలయంలో అమ్మవారి ఎదుట జ్యోతులను దింపారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, కులగురువు దివ్యజ్ఞానానందగిరి స్వామి ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. పరిటాల శ్రీరామ్, చేనేత సంఘాల ప్రముఖులు, టీడీపీ నాయకుడు సంధారాఘవ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, జ్యోతులను తలపై పమోస్తూ, అమ్మవారిని కీర్తిస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొనడం తన అదృష్టమని, చేనేతలకు మంచి జరిగేలా అమ్మవారి ఆశీర్వాదం ఉండాలని పరిటాల శ్రీరామ్ ఆకాంక్షించారు. అన్ని వార్డులలోని అమ్మవార్ల ఆలయాల్లో ఆయన పూజలు నిర్వహించుకున్నారు. వేడుకలను తిలకించడానికి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తొగటవీర క్షత్రీయులు తరలివచ్చారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐలు నాగేంద్రప్రసాద్, రెడ్డప్ప బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీ సీడ్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య, చేనేత ప్రముఖులు జయశ్రీ పాల్గొన్నారు.

21న దివ్యాంగుల కమిటీ హాల్ ప్రారంభం

● ఎంపీ అంబికాకు ఆహ్వానం



ఎంపీ అంబికాను కలిసిన దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పామిడి సమీపంలో విశాల పెర్రర్ దివ్యాంగుల కమిటీ హాల్ ప్రారంభోత్సవానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆహ్వానించారు. సమితి ఉమ్మడి జిల్లా కో - ఆర్డినేటర్ హరి నాథ్‌రెడ్డి, పామిడి మండలం అధ్యక్షుడు కేశవచారి, ఉపాధ్యక్షుడు నాగభూషణ, కార్యదర్శి సర్వేష్, నాయకులు బందే సాబ్, నరసింహులు, శివన్న బుధవారం నగర శివారులోని ఎంపీ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వానించారు. ఈ నెల 21న ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భం గా హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. కమిటీ హాల్ నిర్మాణానికి రూ.7 లక్షలు ఎంపీ నిధులు కేటాయించి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ హాల్ చుట్టూ ప్రహరీ, మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

జిల్లా సబ్‌జూనియర్ బాలుర హాకీ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): జిల్లా సబ్ జూ నియర్ హాకీ బాలుర జట్టును ఎంపిక చేసినట్లు హాకీ అనంతపురం జిల్లా కార్యదర్శి అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. జట్టుకు ప్రదీప్, ఆంజనేయులు, జి వరుణ్, జస్వంత్, నూర్ మహ్మద్, అక్షయ్ కుమార్, కార్తీక్, గయానందరెడ్డి, వరుణ్, నందకిశోర్, గోవర్ధన్, అభిరా, పవన్, ఉదయ్, బాబాఫరీద్, వెంకటేష్, పవన్‌కుమార్, జునైద్, స్టాండ్ బైలుగా దీపక్, ధనుష్‌కుమార్, మోహిత్ ఎంపికయ్యారన్నారు. వీరు శుక్రవారం నుంచి మదనపల్లిలో నిర్వహించే 14వ ఏపీ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలు, క్రీడా సామగ్రితో హాజరుకావాలని ఆయన వివరించారు.



ఎంపికైన సబ్ జూనియర్ బాలుర జట్టు



ఆరబోసిన కందులు

ఉమ్మడి జిల్లాలో కంది కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ఖరీఫ్(2023) సీజన్‌లో ఏడాది సివిల్‌సప్లై కార్పొరేషన్ ఆధ్వర్యంలో రైతుల నుంచి కనీస మద్దతు ధరతో కందులు కొనుగోలు చేశారు. గతంలో బహిరంగ మార్కెట్‌లో ఎంత ధర ఉంటే అదే ధరకు ప్రభుత్వం కందులు కొనుగోలు చేసేది. ఈ ఏడాది ఏపీ మార్క్‌ఫెడ్‌కు కందులు కొనుగోలు బాధ్యతలు అప్పగించారు. ఈ ఏడాది క్వింటా కంది కనీస మద్దతు ధర రూ.7550గా నిర్ణయించారు. రెండు నెలల కిందట బహిరంగ మార్కెట్‌లో క్వింటా కంది రూ.9వేల నుంచి రూ.10వేలు పలికింది. ఆ తర్వాత క్రమంగా తగ్గింది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ.6500 నుంచి రూ.7300 దాకా పలుకుతోంది. గతేడాది ఖరీఫ్ ఆరంభంలో సాగు చేసిన కంది పంట దిగుబడి వచ్చింది. అరకొరగా వచ్చిన దిగుబడికి ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో రైతులు నిట్టూరుస్తున్నారు. ధర భారీగా తగ్గడంతో కొందరు రైతులు పంట దిగుబడిని అలాగే నిల్వ చేసుకున్నారు. మరికొందరు బహిరంగ మార్కెట్‌లో అయినకాడికి విక్రయిస్తున్నారు. గత ఖరీఫ్‌లో(2023) డిసెంబరు రెండో వారంలోనే కందులు కొనుగోలు ఆరంభించారు. ఈ సారి అదే సమయానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కందులు కొనుగోలు ప్రక్రియ ఆరంభించకపోతే రైతులు మరింత నష్టపోయే ప్రమాదం ఉంది.

-ఆంధ్రజ్యోతి అనంతపురం అర్బన్/ గుత్తి రూరల్



ఎప్పుడు కొంటారు..?

రైతుల ఇళ్లలో కంది దిగుబడులు

ఆర్‌ఎస్‌కేలలో రిజిస్ట్రేషన్లతో సరి

కొనుగోలు ప్రారంభించని మార్క్‌ఫెడ్	ధర తగ్గి పోవడంతో రైతుల్లో ఆందోళన	ప్రభుత్వ కనీస మద్దతు ధర రూ.7550



గుత్తి మండలంలో కంది పంటను కోస్తున్న దృశ్యం



గుత్తి పరిధిలో బస్తాల్లో ఉంచిన కందులు

మందకొడిగా రిజిస్ట్రేషన్

ఉమ్మడి జిల్లాలో కంది రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. గతేడాది డిసెంబరు 15 నుంచి ఉమ్మడి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో కందులు విక్రయించాలనుకునే రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు ప్రకటించారు. అయితే క్షేత్రస్థాయిలో పలు ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సరిగా చేయలేదన్న విమర్శలున్నాయి. గత వారం రోజుల నుంచి రైతు సేవా కేంద్రం సిబ్బంది వాట్సాప్ గ్రూప్‌ల్లో సమాచారం అందించి, కంది రైతుల పేర్లు రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేసినట్లు సమాచారం. అనంత జిల్లాలో ఇప్పటి దాకా 1440 మంది రైతులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఇప్పటి దాకా 900 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అనంత జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 1.03 లక్షల హెక్టార్లల్లో కంది పంట సాగు చేయగా 71వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో 36వేల హెక్టార్లల్లో కంది పంట సాగు చేశారు. దాదాపు 28వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా వేశారు. అనంత జిల్లాలో కనీస మద్దతు ధరతో 45వేల మెట్రిక్ టన్నులు, శ్రీ సత్యసాయిలో 15వేల మెట్రిక్ టన్నుల కంది కొనుగోలు చేయాలని ఏపీ మార్క్‌ఫెడ్ రాష్ట్ర ఉన్నతాధికారులు నిర్ణయించారు.



ఏపీ మార్క్‌ఫెడ్ కార్యాలయం

కొనుగోలు ఎప్పటి నుంచో...?

ఈ ఏడాది కంది కొనుగోలు బాధ్యతలను ఏపీ మార్క్‌ఫెడ్ అధికారులు పలు రకాల సొసైటీలకు అప్పగించారు. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి కొనుగోలుకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయలేదు. ఆదేశాలు రాగానే కొనుగోలు ప్రారంభిస్తామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. కనీస మద్దతు ధర అమలు చేసేందుకు 12 శాతంలోపు తేమ శాతం ఉండాలని నిబంధన విధించారు. ఖరీఫ్‌లో ఈ పంట నమోదు ఆధారంగానే పేర్లు నమోదు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో పలువురు రైతులు వేరుశనగ పంటకు అంతర పంటగా కంది సాగు చేశారు. మరికొందరు పూర్తిగా కంది పంటనే సాగు చేశారు. అంతర పంటగా సాగు చేసిన రైతులకు పేరు నమోదులో చుక్కెదురవుతోంది. ఈ పంట నమోదులో వేరుశనగ పంటగా నమోదు కావడంతో... కంది పంట దిగుబడి వచ్చినా కనీస మద్దతు ధరకు విక్రయించలేని దుస్థితి నెలకొంది. మరోవైపు ఒక్కో రైతు నుంచి ఎన్ని క్వింటాళ్లు కందులు కొనుగోలు చేస్తారన్న అంశంపై స్పష్టత లేదు. మండలం యూనిట్‌గా దిగుబడి ఆధారంగా ఒక్కో రైతుతో ఎన్ని క్వింటాళ్లు కొనుగోలు చేసేది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత యాప్‌లో తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఎక్కువ విస్తీర్ణంలో కంది పంట సాగు చేసిన రైతులు ఏం చేయాలో తోచని సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

కర్నూలుకు వెళ్లాల్సిందేనా...?

జిల్లాలో కనీస మద్దతు ధరతో కొనుగోలు ప్రక్రియ ఇంకా మొదలు పెట్టకపోవడంతో ఎక్కువ విస్తీర్ణంలో కంది సాగు చేసిన రైతులు కర్నూలు మార్కెట్‌పై దృష్టి పెట్టారు. అక్కడికి కందులు తీసుకెళ్లి విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. రెండు నెలల కిందట బహిరంగ మార్కెట్‌లో క్వింటా కంది ధర రూ.9వేల నుంచి రూ.10వేలు ఉండేది. గతేడాది డిసెంబరు నుంచి ధర తగ్గుతూ వచ్చింది. బహిరంగ మార్కెట్‌లో కందులు నాణ్యత ఆధారంగా ప్రస్తుతం క్వింటా రూ.6500 నుంచి రూ.7300 నడుస్తోంది. కర్నూలు మార్కెట్‌లో ప్రస్తుతం నాణ్యత బట్టి రూ.7600 నుంచి 7750 దాకా ఉంది. అక్కడ నాణ్యత ఆధారంగానే రోజు వారిగా ధర నిర్ణయిస్తున్నట్లు సమాచారం. కందులు విక్రయించిన వెంటనే నగదు చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.



త్వరగా కొనుగోలు చేయాలి..



పది ఎకరాల్లో కంది పంట సాగు చేశాను. 27 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రైతు సేవా కేంద్రంలో పేరు రిజిస్ట్రేషన్ చేసుకున్నా. ఎప్పటిలోగా కందులు కొంటారో కచ్చితంగా ఎవరూ చెప్పలేకపోతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం కనీస మద్దతు ధరతో త్వరగా కందులు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

-పెద్దన్న, రామినేపల్లి, రాప్తాడు మండలం

కర్నూలు మార్కెట్‌కు తీసుకువెళ్తా..



ఖరీఫ్ ఆరంభంలోనే ఐదెకరాల్లో కంది పంట సాగు చేశా. ఈ సారి ఎకరాకు నాలుగున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. రైతు సేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. అయితే ఎప్పటి నుంచి కొనుగోలు మొదలు పెడతారో అర్థం కావడం లేదు. అందుకే కర్నూలు మార్కెట్‌కు కందులు తీసుకెళ్లి అమ్మేద్దామనుకుంటున్నా.

- శివారెడ్డి, కందుకూరు, అనంతపురం రూరల్ మండలం

ఆదేశాలు రాగానే కొనుగోలు..

గతేడాది డిసెంబరు 15 నుంచి ఉమ్మడి జిల్లాలోని రైతు సేవా కేంద్రాల్లో కందుల కొనుగోలు కోసం రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నాం. ఖరీఫ్‌లో ఈ-పంట నమోదు ఆధారంగానే రైతుల పేర్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నాం. రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే.. సంక్రాంతి పండుగ తర్వాత ఉమ్మడి జిల్లాలో కందులు కొనుగోలు ఆరంభిస్తాం. కొనుగోలు ఆరంభమైన తర్వాత కూడా కొత్తగా ఎవరైనా పేర్లు నమోదు చేసుకోవచ్చు.

- పెన్నేశ్వరి, గీత, ఏపీ మార్క్‌ఫెడ్ డీఎంలు

టమోటా కిలో రూ.9

అనంతపురం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 9తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 90టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.7, కనిష్ఠ ధర రూ.5 పలికినట్లు ఆయన తెలిపారు.



పని ఒత్తిడి భరించలేక టెకీ ఆత్మహత్య



టెకీ శివరాఘవరెడ్డి మృతదేహం

ధర్మవరం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పని ఒత్తిడి భరించలేక ఓ టెకీ ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణంలోని ఓ లాడ్జిలో ఈనెల 13వ తేదీన రాత్రి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ శివరాఘవరెడ్డి (22) ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం ఉమ్మాయిపల్లికి చెందిన రామచంద్రారెడ్డి కుమారుడు శివరాఘవరెడ్డి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండేవాడు. పనిఒత్తిడి ఎక్కువవడం, ఉద్యోగం ఇష్టంలేక తీవ్ర ఆవేదన చెందాడు. ఈనెల 13న ధర్మవరం చేరుకుని, ఓ లాడ్జిలో గది అద్దెకు తీసుకున్నాడు. అదే రోజు రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని, మరణించాడు. 14న ఉదయం లాడ్జి సిబ్బంది గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి, టెకీ మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టెకీకి వివాహం కాలేదు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో బేల్దారి..

కొత్తచెరువు: మండలకేంద్రంలోని పోతలప్పస్వామి గుడి సమీపాన బేల్దారి బోయ శివ (38) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ ఇందిర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రానికి చెందిన బోయశివ మూడు నెలల క్రితం ఉపాధి కోసం కొత్తచెరువుకు భార్య, పిల్లలతో వచ్చాడు. బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. అతడి భార్య గోరంట్ల మండలం గుంతపల్లి వద్ద ఉన్న గార్మెంట్స్‌లో పనిచేస్తుంది. ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకున్నాడు. ఎంత సేపటికీ శివ బయటకు రాకపోవడంతో స్థానికులు ఇంటి తలుపులు తట్టినా పలకలేదు. దీంతో తలుపులు బద్దలుకొట్టి చూడగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీనిపై స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివకు భార్య సావిత్రి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో ఉరుసు



విద్యుత్ దీపాలంకరణలో దర్గా

అనంతపురం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిమి గ్రామ శివార్లలో వెలసిన హజరత్ సయ్యద్ బాష వలిషా గంధం-ఉరుసు ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. దర్గాలోని దైవ స్వరూపుల సమాధిపై చాదర్‌లు, గంధం, పన్నీరు వంటివి ఏర్పాటు చేశారు. ఫకీర్ల విన్యాసాలు, పవిత్ర ఖురాన్ పఠనం, దరూద్ షరీఫ్, నాతే షరీఫ్ నిర్వహిం చారు. ఆధ్యాత్మిక, ధార్మిక, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ముస్లిం జమాత్ పెద్దలు, వివిధ మసీదు మదరసాలకు చెందిన విద్యార్థులు, భక్తజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



శోభన్‌బాబు పాటలను పాడుతున్న గాయకులు

అనంతపురం కల్చరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): సినీ హీరో శోభన్‌బాబు 89వ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ కళాసమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయం త్రం స్థానిక కృష్ణకళామందిర్‌లో నిర్వహించిన సంగీత విభావరి వీక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ స్ర్కీన్‌పై శోభన్‌బాబు సినిమాలోని పాటల వీడియోను ప్రదర్శిస్తుండగా గాయకులు పాటలను ఆలపించారు. అనంతరం శోభన్‌బాబు సేవాసమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ కళాసమితి నిర్వాహకులు రామాంజి, బాలమురళి, చంద్రమౌళి, దాదాఖలందర్, నంజుండప్ప, శ్రీదేవి, విజయలక్ష్మి, శోభన్‌బాబు సేవాసమితి సభ్యులు భూసన్న, వెంకటరామిరెడ్డి, గౌస్‌పీరా, శ్రీనివాసులు, రఫి, రోషన్, శ్రీనివాసులు, వెంకటేష్, నరసింహులు, సిరాజ్, అమర్నాథ్, సత్యనారాయణ, రాజేంద్ర, కృష్ణమూర్తి, రవి, రాజు, ధర్మవరం వెంకటేష్ పాల్గొన్నారు.

బైక్ ఢీకొని చిన్నారికి గాయాలు

అనంతపురం క్రైం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగరంలో ద్విచక్రవాహనం ఢీ కొని ఎనిమిదేళ్ల చిన్నారికి తీవ్రగాయాలయ్యాయి. ఈనెల 12వ తేదీ అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి గ్రామానికి చెందిన చైత్ర అనే చిన్నారి తన ఇంటి ఎదుట ఆడుకుంటోంది. అదే సమయంలో సాయి అనే యువకుడు ద్విచక్రవాహంలో వెళ్తూ చైత్రను ఢీ కొన్నాడు. దీంతో చైత్ర తలకు తీవ్ర గాయం కావడంతో బెంగళూరుకు తీసుకెళ్లారు. ఈ ఘటనపై చిన్నారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు అదుపుతప్పి మహిళకు...

గార్లదిన్నె, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంటిమడుగు గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై మంగళవారం కారు అదుపుతప్పి అల్తాఫ్ జహినా అనే మహిళాకు గాయాలయ్యాయి. తమిళనాడు రాష్ట్రం తిరుచ్చికి చెందిన అల్తాఫ్‌జహిన కుటుంబ సభ్యులతో తిరుచ్చి నుంచి హైదారాబాదుకు కారులో వెళు తున్నారు. ముంటిమడుగు సమీపంలో ద్విచక్రవాహనం ఎదురు వచ్చింది. డ్రైవర్ దాన్ని తప్పించబోగా కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీ కొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అల్తాఫ్ జహినాకు కాలు విరిగింది. ఆమెను 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

డీ.హీరేహాళ్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఇంటికి పెయింటింగ్ చేస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్ గురై ఓ యువకుడు మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన యువకుడు గణేష్(20) పెయింటర్‌గా జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మండలంలోని సోమలాపురం గ్రామంలో బుధవారం ఓ ఇంటికి పెయింటింగ్ చేయడానికి వెళ్లాడు. ఇంటి బయట ఎలివేషన్‌కు పెయింటింగ్ చేస్తున్న సమయంలో సమీపం లో ఉన్న కరెంటుతీగలను గమనించకుండా తగిలాడు. దీంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి పరిశీలించారు. మృతుడి తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలియజేశారు.

గాయపడిన చిన్నారి...

రాయదుర్గం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదరంపల్లి గ్రామంలో నాలుగురోజుల క్రితం నూనెలో పడి తీవ్రంగా గాయపడిన చిన్నారి బాలుడు శ్రీనివాసు లు(3) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందు తూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కదరంపల్లికి చెందిన నవీన్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు శ్రీనివాసులు. నాలుగు రోజుల క్రితం నాగలక్ష్మి ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ శ్రీనివాసులు వేడిగా ఉన్న వంట నూనె గిన్నెపై పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి, అటే నుంచి కర్నూలుకు తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కళ్ల ఎదుట కుమారుడు మృతిచెందడంతో దంపతులు శోకసముద్రంలో మునిగిపోయారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం



రాజేంద్రప్రసాద్ (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడాపురానికి చెందిన టీడీపీ నాయకుడు జోగన్నగారి రాజేంద్ర ప్రసాద్ (42) అలియాస్ రాజ అనా రోగ్యంతో మంగళవారం మృతిచెం దారు. ఆయనకు భార్య శాంతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు.



తపోవనంలో రథోత్సవం



తలుపూరు చెన్నకేశవస్వామి ఆలయం వద్ద గోపూజ

ఘనంగా సంక్రాంతి వేడుకలు

అనంతపురం కల్చరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి సంబరాలు వైభవోపేతంగా సాగాయి. మంగళ, బుధవారాల్లో ప్రజలు పెద్దఎత్తున సంక్రాంతి, కనుమ వేడుకలను జరుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముంగిట రంగురంగుల రంగవల్లులను వేసి, గొబ్బెమ్మలను ఏర్పాటు చేసి సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానించారు. ఆలయాల్లోనూ మకర సంక్రమణ పూజలు, కనుమనాడు గోపూజ నిర్వహించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆత్మకూరు మండలం తలుపూరులోని చెన్నకేశవస్వామి దేవాలయం వద్ద బుధవారం సాయంత్రం గోపూజ చేశారు. అలాగే కనుమ సందర్భంగా సాగిన వనవిహారాలు, విందు, వినోదాలతో నగర శివార్లలోని పార్కులు కిక్కిరిశాయి. చిన్న, పెద్ద తేడా లేకుండా నగరవాసులు శిల్పారామంలో ఉల్లాసం గా గడిపారు. బంధుమిత్రులతో కలిసి ఆడుతూ, పాడుతూ చిన్నారులు కేరింతలతో గడిపారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో మల్లు స్వరాజ్యం కాలనీ, గణేనాయక్ కాలనీ, మహదేవనగర్‌లలో మహి ళలకు ముగ్గులపోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. పలుప్రాంతాల్లో ఆలయాలలో ప్రత్యేక పూజలు, రథోత్సవాలు జరిగాయి. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలో తపోవనంలోని శివశక్తి దేవాలయం వద్ద సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఉంచి నగరోత్సవం నిర్వహించారు.



గణేనాయక్ కాలనీలో ముగ్గులపోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి/కనగానల్లి/శింగనమల, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్ర మైన చెన్నేకొత్తపల్లిలో ధనుర్మా సం చివరి రోజును పురస్కరిం చుకుని మంగళవారం చెన్నకేశవ స్వామి, దేవేరుల ఉత్సవ విగ్రహా లను ఊరేగించారు. అలాగే కనగానపల్లి మండలపరిధిలోని తూంచెర్ల గ్రామంలో బుధవారం కనుమను పురస్కరించుకుని ట్రాక్టర్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి టీడీపీ నాయకులు యాతం పోతలయ్య, మాజీ ఎంపీటీసీ ఆదెప్ప, చెన్న ప్ప, శ్రీరాములు, జయశంకర్, మల్లికార్జున, నరసప్ప తదితరులు బహు మతులు అందజేశారు. శింగనమల ఆత్యసీతారామ స్వామి దేవాలయం వద్ద మంగళవారం నాగులగుడ్డం గ్రామానికి చెందిన దాసరి వెంకటరాముడు కుటుంబ సభ్యులు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మెదటి బహుమతి పొందిన గార్లదిన్నె ప్రియాంకకు రూ.5000, రెండోవ బహుమతి పొందిన సుగుణకు రూ.2500, మూడో బహుమతి పొందిన కమలకు రూ.1000 అందజేశారు. అలాగే ప్రోత్సాహక బహుమతుల కింద పోటీల్లో పాల్గొన్న మరో ముగ్గురు మహిళలకు రూ.500 చొప్పున అందజేశారు.



చెన్నేకొత్తపల్లిలో చెన్నకేశవస్వామి



తూంచెర్లలో బహుమతులు అందజేస్తున్న దృశ్యం



శింగనమలలో విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

టీడీపీతోనే బీసీల అభివృద్ధి

● ఏపీ గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి



గురుమూర్తిని సన్మానిస్తున్న పోతులయ్య ఇతర నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): బీసీ వర్గాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గురుమూర్తి పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనను బుధవారం టీడీపీ కుమ్మర శాలి వాహన సమితి రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు స్థానిక శ్రీనగర్ కాలనీలో కలిశారు. శాలువ కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతించారు. ఈ సందర్భంగా గురుమూర్తి మాట్లాడుతూ... బీసీ కులాలకు చెందిన యువత, కార్మికులు, మహిళలకు 50 శాతం సబ్సిడీతో లక్షలాది రూపాయల రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుమ్మర శాలి వాహన సంఘం నాయకులు వెంకటనారాయణ, కేవీ రమణ, రామాంజినేయులు, వెంకటలక్ష్మమ్మ, రామకృష్ణ, కృష్ణ, చంద్ర, నల్లప్ప, భారతి, లక్ష్మీనారాయణ, నాగభూషణం, విశ్వనాథ్, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడాపోటీలు



విజేతలకు బహుమతులు అంజేస్తున్న నిర్వాహకులు

అనంతపురం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యేడు గ్రామంలో క్రీడపోటీలు అట్టహాసంగా సాగాయి. గ్రామస్థుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు సీజన్-4 నిర్వహించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి. సీనియర్ క్రికెట్ పోటీల్లో ఫై గేరు జట్టుపై, బ్యాంకు బ్లాస్టర్స్ జట్టు విజయం సాధిం చింది. గ్రామస్థులు లక్ష్మీనారాయణ, చెంద్రాయుడు విజేతలకు కప్పుల ను అందించారు. కబడ్డీ పోటీలు దోస్తీ జట్టు, తగ్గగేరు జట్టు మధ్య సాగాయి. సంయుక్త విజేతలుగా నిలిచారు. పెద్దగోర్ల సుబ్బారెడ్డి, మండల వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి బహుమతులను అందజేశారు. వాలీ బాల్ పోటీల్లో ఫైగేరి జట్టుపై బ్యాంక్ బ్లాస్టర్స్ జట్టు గెలుపొందింది. వీరికి తాతిరెడ్డి ఎర్రిస్వామిరెడ్డి, దివాకర్‌రెడ్డి బహుమతులను అందిం చారు. జూనియర్ క్రికెట్ పోటీల్లో ఎస్ఎల్ఎన్ఎస్ జట్టు ఫైగేరు జట్టుపై విజయం సాధించింది. మీసేవ బషీర్ బహుమతులను అందించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కార్యక్రమాలను వీక్షిస్తున్న ప్రజలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

అనంతపురం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను అలరించాయి. సంక్రాంతి పండుగ ను పురస్కరించుకుని శిల్పారామం ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం ధర్మవరానికి చెందిన శ్రీ లలిత నాట్య కళానికేత్ ఆధ్వర్యంలో నృత్య గురువు బాబు బాలాజీ శిష్య బృందం వివిధ సాంస్కృతి కార్యక్రమాలు ప్రదర్శించారు. వినాయక స్తుతి, లింగాష్టకం, కుంభజ్యోతి నాట్యం, కోలాటం, లంబాడి నాట్యం, సంక్రాంతి నృత్యం వంటి వాటిని ప్రదర్శించారు. బుధవారం మైదుకూరుకు చెందిన ఇంద్రజాలికులు ఇంద్రజాల ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. ఈ కార్యక్రమంలో కళాకారులు రామలాలిత్య, లీలమాధవి, ఇందు ప్రణీత, యశశ్రీ, రాజస్వి, అర్యన, దేవిసుత్తి, యశస్వినీ, లాస్య, హర్షిణి ప్రియ ముత్యభావన, ధ్రువశ్రీ, తన్విక, కీర్తన, మోక్షిత పాల్గొన్నారు.

అధికారం మారినా... మారని బోర్డులు



సమాచార బోర్డులో పాత అధికారి షఫీ పేరు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నిబంధన ప్రకారం అధికారి బదిలీ అయినా, సస్పెన్షన్ లేదా పదవీవిరమణ పొందిన వెంటనే పాత అధికారి స్థానంలో కొత్తగా బాధ్యతలు తీసుకున్న అధికారి పేరును రెండు మూడు రోజుల్లో చేర్చాలి. అయితే అధికారి మారి దాదాపు రెండు నెలలు దాటుతోంది. అయినా ఇప్పటికీ రికార్డులు, బోర్డుల్లో పాత అధికారి పేరే కనిపిస్తోంది. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ (డీఎస్‌డీఓ) అధికారి షఫీ వివిధ ఆరోపణలల నేపథ్యంలో గత సంవత్సరం నవంబరు 14వ తేదీన సస్పెండ్ అయ్యారు. దీంతో శ్రీసత్యసాయి జిల్లా డీఎస్‌డీఓగా ఉన్న ఉదయ్‌భాస్కర్‌ను ఆ స్థానంలో నియమించారు. అశోక్‌నగర్ డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలోని కార్యాలయంలో సమాచార హక్కు చట్టం, ఉద్యోగులు, కోచ్‌ల వివరాలు తెలిపే బోర్డుల్లో పాత అధికారి పేరే కనిపిస్తోంది. కొత్త అధికారి పేరు ఎప్పుడు చేరుస్తారో చూడాలి.

● శింగనమల: ప్రభుత్వం మారిన ఆర్నెల్లు దాటింది. కానీ ఆ గ్రామ సచివాలయంపై ఉన్న అప్పటి సీఎం జగన్, నవరత్నాల పథకాల బొమ్మలను ఇప్పటికీ తొలగించలేదు. గత వైసీపీ హయాంలో మండలంలోని వెస్టునరసాపురం సచివాలయంపై జగన్, నవరత్నాల బొమ్మ వేశారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో అప్పట్లో అధికారులు వాటిపై పేపర్లు అతికించి మూసివేశారు. ఎన్నికల అనంతరం టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. దాదాపు అన్ని సచివాలయాలపై నవరత్నాల బోర్డులను పగులగొట్టిగానా, రంగులు వేసిగానీ కనిపించకుండా చేశారు. వెస్టునరసాపురంలో మాత్రం పేపర్ అతికించి విడిచి పెట్టారు. ఇటీవల ఆ పేపర్ ఊడిపోవడంతో సచివాలయంపై జగన్ నవరత్నాల బొమ్మలు కనబడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఆర్నెల్లు గడిచినా వాటిని తొలగించకపోవడం పట్ల టీడీపీ కార్యాకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వెస్టునరసాపురం సచివాలయంపై జగన్ నవరత్నాల బొమ్మ

అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



రేకలకుంట గ్రామంలో సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే ధ్యేయంగా టీడీపీ కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి టీడీపీ పాలనలోనే సాధ్యమన్నారు. బుధవారం మండల పరిధిలోని రేకలకుంట గ్రామంలో పల్లె పండగ కింద నిర్మించిన సీసీ రోడ్డును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన ఆర్నెల్లలోనే గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో గ్రామాల్లో ఒక్క రోడ్డు కూడా వేసిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా రూ.ఆరు కోట్ల వ్యయంతో గ్రామాల్లో మౌలిక సదుపాయల కల్పనకు తాము కృషి చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే వేసవిలో నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా ముందస్తు ప్రణాళిక రుపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్‌రాజ్, డీఈ అరుణ్‌కుమార్, జేఈ మద్దిలేటి, టీడీపీ కన్వీనర్ అశోక్, ఎంపీపీ సునీత, టీడీపీ జిల్లా నాయకులు పసుపుల శ్రీరామిరెడ్డి, సాకే రామక్రిష్ణ, కేశన్న, లక్ష్మీనారాయణ, పొడరాళ్ల రవీంద్ర, ఓబులపతి, పెద్దప్ప, రమణమూర్తి, రమేష్, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా పార్వేటోత్సవం



అశ్వ వాహనంపై ఊరేగుతున్న ఖాద్రీశుడు

కదిరి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి పార్వేటోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా సాగింది. స్వామివారికి ఉదయం ఆలయంలో నిత్యపూజలు, కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం పార్వేటకు బయలుదేరారు. ఆలయం నుంచి భక్తుల గోవిందనామస్మరణ మధ్య తిరువీధుల నుంచి గిరి ప్రదక్షణగా కదిరి కొండకు చేరుకున్నారు. శ్రీవారి పల్లకీని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మోశారు. అనంతరం అర్చకులు నివేదనలు, పూజల అనంతరం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న పాలపొంగలి ఉట్టికి మధ్యాహ్నం చేరుకున్నారు. కౌలేపల్లికి చెందిన యాదవులు కొత్తకుండలో తెచ్చిన పాలను పోసి, పాలపొంగలితో స్వామివారికి నివేదన చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పార్వేట మండపానికి స్వామివారు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం పార్వేటలో స్వామివారు పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు పార్వేటను తిలకించడానికి తరలివచ్చారు. కుందేళ్లను ఎగురవేసి పార్వేటలో పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం రాయచోటి రోడ్డులో ఉన్న శమీ మండపానికి స్వామివారు చేరుకుని, పూజలు అందుకున్నారు. అనంతరం అశ్వవాహనంపై చౌక్ మీదుగా తిరువీధుల్లో స్వామివారు ఊరేగారు. అనంతరం ఆలయంలో అలకబూనిన శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సంవాదం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్, ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుపతి ఎస్పీ బదిలీని నిలిపివేయాలి

● టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అదనపు కార్యదర్శి

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం వేచి ఉన్న భక్తుల మ ధ్య జరిగిన తొక్కిసలాటకు తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడును బాధ్యుడిని చేస్తూ చేసిన బదిలీని వెంటనే రద్దు చేయాలని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అదనపు కార్యదర్శి, అనంతపూర్ క్లబ్ సభ్యుడు లక్ష్మన్న.. ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు రాసిన లేఖను ఆయన బుధవారం మీడియాకు విడుదల చేశారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఉత్తర ద్వార దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మృతిచెందడం, మరికొందరు గాయపడడం బాధాకరమన్నారు. నిబద్ధత కలిగిన ఎస్పీ సుబ్బ రాయుడు బదిలీని పునఃసమీక్షించాలని కోరారు.

కబడ్డీ పోటీల విజేత డేంజర్ జట్టు



విజేత డేంజర్ జట్టు

గార్లదిన్నె, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాత కల్లూరులో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు పోటాపోటిగా సాగాయి. ఈ పోటీల్లో పాత కల్లూరుకు చెందిన డేంజర్ జట్టు, మరో జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. కదిరిపల్లి జట్టు మూడో స్థానంలో, యర్రగుంట్ల జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతి రూ.8 వేలను లక్ష్మీ వెంకటేశ్వర రైస్‌మిల్ వెంకట్రాముడు, రెండో బహుమతి రూ.5వేల ను తడికెత్తుల నాగరాజు వీఆర్ఏ, మూడో బహుమతి రూ.3వేలను పుట్టుకల మల్లి కార్జున, పిల్లల సింగరయ్య, నా లుగో బహుమతి రూ. వెయ్యిని కుమ్మర నరేష్ విజేతలకు అందజేశారు. పోటిల్లో ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా గ్రామస్థులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

హోటల్, బంకులో చోరీ

గుత్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఓ హోటల్‌తో పాటు బంకులో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. తొలుత హోటల్‌లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.3వేల నగదు ఎత్తుకెళ్లారు. తర్వాత పక్కనే ఉన్న బంకు తాళాలను పగులగొట్టి రూ.4వేలు విలువ చేసే సిగరెట్ల ప్యాకెట్లను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందెం నిర్వాహకుల అరెస్టు

ఉరవకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం గూళ్యపాలెంలో మంగళవారం తొమ్మిదిమంది కోడిపందెం నిర్వాహకులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. కోడి పందెలు ఆడుతున్నట్లు సమాచారం రావడంతో వెంటనే దాడి చేసి, నిర్వాహకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. అలాగే మూడు కోడిపుంజులు, రెండు కత్తులు, రూ.14,750లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

10మంది పేకాటరాయుళ్లు..

పెద్దవడుగూరు: మండలంలోని ఏ. తిమ్మాపురం గ్రామశివారులో బుధవారం 10మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.42,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు. అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి పేకాటస్థావరంపై దాడిచేశామని, అందులో పేకాటాడుతున్న వారిని అరెస్ట్‌చేసి కేసు నమోదుచేసినట్లు ఆయన చెప్పారు.

టీడీపీ నాయకుల బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం చాబల నుంచి జనార్ధనపల్లి వరకూ ఉన్న గుంతల రోడ్డును బీటీ రోడ్డుగా నిర్మించడంతో ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం టీడీపీ నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత చాబాలలోని అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత తారు రోడ్డును ప్రారంభించి బైక్ ర్యాలీ చేపట్టారు. నాయకులు రేగాటిమ నాగరాజు, నూతేటి వెంకటేశులు, బీడీ మారయ్య, విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్లను తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, కూటమి అధికారంలోకి రాగానే రోడ్లను అభివృద్ధి చేస్తోందని తెలిపారు. నాయకులు దేవేంద్ర, భీమలింగ, నాగేంద్ర, నాగన్న, సుబ్బరాయుడు, శేషప్ప, లింగమూర్తి, నరేష్, సర్పంచులు చంద్ర, జనార్దన్ పాల్గొన్నారు.

లత్తవరంలో రైతుల సంబరాలు


చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ఉరవకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీ కాలువ కింద భూములు కోల్పోయినందుకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేయడంపై ఆయా రైతులు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని లత్తవరంలో మంగళవారం రైతులు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి పయ్యావుల కేశవ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి, బాణా సంచా కాల్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2019 కి ముందు టీడీపీ హయాంలో అప్పుడుఎమ్మెల్సీగా ఉన్న పయ్యావుల కేశవ్‌పై ఉన్న నమ్మకంతో కాలువ కోసం భూములు ఇచ్చామన్నారు. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో పరిహారం కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా, ఎవరూ పట్టించుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లోనే మంత్రిగా ఉన్న కేశవ్ పరిహారాన్ని తమ ఖాతాల్లోకి జమచేయించారన్నారు. లత్తవరం గ్రామానికి రూ.3.37కోట్లు మంజూరు అయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వానికి రైతులు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. టీడీపీ మండల కన్వీనర్ విజయ్ భాస్కర్, నాయకులు బళ్లారి మల్లికార్జున, వన్నూరుస్వామి, ఓబన్న, గిరి, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం పునరాలోచించాలి: సీపీఐ

గుంతకల్లుటౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి 1నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు జగదీష్ సూచించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం భూమివిలువ-రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుదలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో సీపీఐ, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు. జగదీష్ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగితే పేద, మధ్య తరగతి ప్రజలపై అదనపు భారం పడుతుందన్నారు. రియల్ ఎస్టేట్ రంగాలతో ప్రభుత్వ అధికారులు సమావేశం నిర్వహిస్తే బాగుంటుందన్నారు. ప్రస్తుతం భూముల విలువ పడిపోయిందని అన్నారు. రిజిస్ట్రేషన్ పెంపుపై ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతూ గురువారం ఆర్డీఓకు వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము, రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



గణేష్ (ఫైల్)

డీ.హీరేహాళ్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): ఇంటికి పెయింటింగ్ చేస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్ గురై ఓ యువకుడు మృతి చెందాడు. మండలకేంద్రానికి చెందిన యువకుడు గణేష్(20) పెయింటర్‌గా జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో మండలంలోని సోమలాపురం గ్రామంలో బుధవారం ఓ ఇంటికి పెయింటింగ్ చేయడానికి వెళ్లాడు. ఇంటి బయట ఎలివేషన్‌కు పెయింటింగ్ చేస్తున్న సమయంలో సమీపంలో ఉన్న కరెంటుతీగలను గమనించకుండా తగిలాడు. దీంతో షాక్‌కు గురై కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి పరిశీలించారు. మృతుడి తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

చికిత్స పొందుతూ చిన్నారి..


చిన్నారి శ్రీనివాసులు (ఫైల్)

రాయదుర్గం రూరల్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదరంపల్లి గ్రామంలో నాలుగురోజుల క్రితం నూనెలో పడి తీవ్రంగా గాయపడిన చిన్నారి బాలుడు శ్రీనివాసులు(3) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కదరంపల్లికి చెందిన నవీన్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు శ్రీనివాసులు. నాలుగు రోజుల క్రితం నాగలక్ష్మి ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ శ్రీనివాసులు వేడిగా ఉన్న వంట నూనె గిన్నెపై పడడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు వెంటనే కళ్యాణదుర్గం ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి, అటీ నుంచి కర్నూలుకు తరలించారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కళ్ల ఎదుట కుమారుడు మృతిచెందడంతో దంపతులు శోకసముద్రంలో మునిగిపోయారు.


ఉరవకొండలోని పోలీస్ క్రీడా మైదానంలో నృత్యం చేస్తున్న చిన్నారులు


కూడేరు మండలం జల్లిపల్లిలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్ బాషా, సీఐ రాజు


బెళుగుప్పలో హరిదాసు

అంబరాన్నంటిన.. సంక్రాంతి సంబరం..


గుత్తి మండలం తొండపాడులో పూజలందుకుంటున్న రంగనాథ స్వామి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల వ్యాప్తంగా ప్రజలు మంగళవారం అత్యంత వైభవంగా పండుగను జరిపారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాల్లో సైతం వేకువజామునే మహిళలు ఇళ్ల ముంగిళ్లలో కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేశారు. ఇళ్లను తోరణాలు, పూలతో అలంకరించారు. ముగ్గులలో గొబ్బెమ్మలను ఉంచి పూజలు చేశారు. తర్వాత సాంప్రదాయ దుస్తుల్లో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేయించారు. రకరకాల పిండివంటలు చేసి బంధుమిత్రులను ఆహ్వానించారు. బంధువుల రాకతో ఇళ్లన్నీ కళకళలాడాయి. హరిదాసులు, గంగిరెద్దుల వాళ్లు వీధివీధి తిరుగుతూ భిక్షాటన చేశారు. పలు గ్రామాల్లో యువత వివిధ ఆటల పోటీలు నిర్వహించి సందడి చేశారు. అలాగే మహిళలకు ముగ్గులు పోటీలు జరిపి విజేతలకు బహుమతులు అందించారు. ఇంకొన్ని గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇక బుధవారం కనుమను పురస్కరించుకుని గ్రామాల్లో రైతులు పాడి పశువులకు పూజలు చేశారు. పండుగ సందర్భంగా ఆలయాల్లోనూ అర్చకులు మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.



ప్రత్యేక అలంకరణలో నేమకల్లు ఆంజనేయస్వామి

ఘనంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం


ఉరవకొండలో పంచమజ్యోతుల ఊరేగింపు


గన్నెవారిపల్లి కాలనీలో..

ఉరవకొండ, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెద్ద చౌడేశ్వరిదేవి అమ్మవారి పంచమ జ్యోతుల ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 4వ వార్డులోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలను చేశారు. తొలుత మంగళవారం రాత్రి పంచ కలశాలతో గంగా జలాన్ని పట్టణంలోని వీధుల గుండా ఊరేగించారు. తొగట వీర కులస్థుల ఆధర్వంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం తెల్లవారుజామున చౌడేశ్వరి కాలనీలోని అశ్వర్థ నారాయణ కట్ట నుంచి జ్యోతులు ప్రారంభమయ్యాయి. మేళ తాళాలు, డప్పు వాయిద్యాల నడుమ జ్యోతులను తలపై ఎత్తుకుని ఊరేగింపుగా ఆలయం వద్దకు వచ్చి అమ్మవారికి సమర్పించి పూజలు చేశారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు.

తాడిపత్రి: పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం వైభవంగా జరిగింది. నిర్వాహకులు స్థానిక ఆలయంలో చౌడమ్మ అమ్మవారికి ప్రత్యేకఅలంకరణలు, పూజలు నిర్వహించారు. అనంతరం జ్యోతులను తలపై ఉంచుకుని పాటలు పాడుతూ చిందులు తొక్కారు. ఉత్సవాన్ని తిలకించడానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

యాడికి: మండలంలోని చందనలో చౌడేశ్వరి జ్యోతుల ఉత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. గ్రామవీధుల గుండా జ్యోతులను ఊరేగించారు. అనంతరం వాటిని ఆలయం వద్దకు తీసుకెళ్లి చౌడేశ్వరి అమ్మవారికి సమర్పించారు.

కూడేరు: మండలం జల్లిపల్లిలో మంగళవారం రాత్రి చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల ఉత్సవం చేపట్టారు. ఈ సందర్భంగా తొలుత అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి జ్యోతులను ఊరేగించారు.

చింతర్లపల్లిలో కొల్లాపురమ్మ జాతర

శెట్టూరు: మండలంలోని చింతర్లపల్లిలో బుధవారం కొల్లాపురమ్మ అమ్మవారి జాతరను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు జ్యోతులు, బోనాలు తెచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజన, కోలాటం, పౌరాణిక డ్రామాలు నిర్వహించారు.

రక్తదానం చేసి.. ప్రాణదాతలు కండి

● ప్రభుత్వ విప్ కాలవ పిలుపు

రాయదుర్గం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో దాతలు విరివిగా పాల్గొనాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పట్టణంలోని తన స్వగృహంలో బుధవారం ఆయన టీడీపీ పట్టణ నాయకులు, వార్డు ఇన్‌చార్జిలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 18వ తేదీన రాయదుర్గం పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి కళ్యాణమంటపంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే కార్యక్రమంలో దాతల నుంచి 500 యూనిట్ల రక్తాన్ని సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అందులో 400 యూనిట్లు ఎన్‌టీఆర్ ట్రస్టుకు, మరో వంద యూనిట్లు బళ్లారిలోని ప్రభుత్వ వైద్యశాలకు అందిస్తామన్నారు. శిబిరంలో దాతలు విరివిగా పాల్గొని రక్తదానం చేయాలని కోరారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం'

పుట్లూరు, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కడవకల్లు- చెర్లోపల్లి గ్రామాల మధ్య ఉన్న అగ్రిగోల్డ్ భూములను వైసీపీ నాయకుడు సాగు చేస్తున్న విషయంపై కలెక్టర్ వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు అగ్రిగోల్డ్ బాధితులు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో డిపాజిట్ చేసి నష్టపోయిన బాధితులంతా కలిసి.. ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. సీజ్‌చేసిన భూముల్లో వైసీపీ నాయకుడు చేస్తున్న అక్రమాలపై కూడా కలెక్టర్‌కు విన్నవిస్తామని వారు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

తాడిపత్రి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన నాగేంద్రపై బుధవారం అదే కాలనీకి చెందిన యూసఫ్, మోతి, దీపక్ కలిసి దాడిచేసి గాయపరిచారని పోలీసులు తెలిపారు. నాగేంద్ర బేల్దారిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కాగా పుట్లూరురోడ్డులోని టైలర్స్‌కాలనీవద్ద అతడు నిలబడి ఉండగా ఆ ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి అతనితో వాదించి ఒక్కసారిగా కత్తితో దాడిచేసి గాయపరిచారు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పుట్లూరు, జనవరి15(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-2003వ విద్యాసంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు బుధవారం మళ్లీ ఇన్నేళ్లకు అదే పాఠశాలలో కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. ఎంఈఓ శ్రీదేవి, పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద సృష్టి ఏదీ?

● చాలా గ్రామాల్లో నిరుపయోగంగా చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు
● కొన్ని చోట్ల మాత్రం తూతూమంత్రంగా నిర్వహణ ● అన్ని వసతులు ఉన్నా.. పట్టించుకోని వైనం
● వైసీపీ హయాం నుంచి భ్రష్టు ● నెరవేరని ప్రభుత్వ లక్ష్యం

కళ్యాణదుర్గం, జనవరి 15(ఆంధ్రజ్యోతి): చెత్తతో సంపద సృష్టించి పంచాయతీలకు అదనపు ఆదాయాన్ని కల్పించాలన్న సదుద్దేశంతో పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గ్రామాల్లో చెత్తతో సంపద తయారీ కేంద్రాలను నిర్మించింది. ఆలోచన బాగున్నా...ఆచరణకు మాత్రం సాధ్యం కాలేదు. ప్రారంభంలో కొన్నేళ్లు బాగానే నడిచినా.. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో సరిగా పట్టించుకోక చాలావరకు నిరుపయోగంగా మారాయి.

కళ్యాణదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 84 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటన్నింటిలోనూ చెత్తతో సంపద సృష్టి కేంద్రాలను నిర్మించారు. ఇందుకోసం ఒక్కొక్క దానికి రూ. 6 లక్షల వరకు ఖర్చు చేశారు. వీటికి కార్మికులను, వాహనాలకు కూడా ఏర్పాటు చేశారు. 120 మంది దాకా క్లాప్‌మిత్రులు కూడా ఉన్నారు. వారికి ఒక్కొక్కరికి నెలకు రూ. 6 వేలు ప్రకారం చెల్లిస్తున్నట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. ఇంత చేసినా సంపద తయారీ కేంద్రాలు సరిగా నడవడం లేదు. కొన్ని చోట్ల మాత్రం తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. అధిక ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. ఎవరైనా ఉన్నతాధికారులు తనిఖీకి వస్తారంటే అన్నీ చేస్తున్నట్లు స్థానిక అధికారులు హడావుడి చేస్తుంటారు.

మేజర్ పంచాతీల్లో రోజుకు పది ట్రాక్టర్ల వరకు వ్యర్థాలు ఉత్పత్తి అవుతోంది. అలాగే మండలకేంద్రాలతో పాటు, కాస్త పెద్ద గ్రామాల్లో వ్యర్థాల ఉత్పత్తి అధికంగా ఉంది. ఆ వ్యర్థాలను ఉపయోగించి వానపాముల ద్వారా వర్మీ కంపోస్టు తయారుచేయడానికి వీలుంది. అయితే వీటి నిర్వహణ లేదు. ఎక్కడ చూసినా చెత్తా చెదారం అంతా రోడ్లపైన, ప్రధాన రహదారుల్లోను దర్శనమిస్తోంది. వర్మీ కంపోస్టును తయారుచేస్తే రైతులు వాటిని కొనుగోలు చేయడానికి ఆస్కారం ఉంటుంది. దాని ద్వారా పంచాయతీకి ఆదాయం సమకూరుతుంది. ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

16 పంచాయతీల్లోనూ నిరుపయోగం..

శెట్టూరు: మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లోనూ చెత్తతో సంపద తయారీ కేంద్రాలు నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా ఉండి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో వీటిని సరిగా పట్టించు కోకపోవడంతోనే పరిస్థితి ఇలా తయారైందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. లక్షల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన వీటిలో కొన్నేళ్లుగా చెత్తతో సేంద్రీయ ఎరువులు తయారు చేసిన పాపాన పోలేదు. కొన్ని గ్రామాల్లో కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మండల అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కుందుర్పి మండలం ఎనుములదొడ్డిలో నిరుపయోగంగా ఉన్న చెత్తతో సంపద తయారీ కేంద్రం


శెట్టూరు మండలకేంద్రంలో..

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం


ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

గుత్తి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తి కోటపై వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని స్వామి వారి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు తొలుత మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు చేశారు. తర్వాత ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్చారణల నడుమ కల్యాణం జరిపించారు. పెద్దఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు.

ముగిసిన జేసీ క్రికెట్ టోర్నమెంట్


విజయం సాధించిన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

తాడిపత్రి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న జేసీ క్రికెట్ టోర్నమెంట్ బుధవారంతో ముగిసింది. చివరిరోజున మొదటగా ఉమెన్స్ జట్లు అయిన అహిక, ధీర్ దివాకర్ జట్లు పోటీపడ్డాయి. అహిక జట్టు 12ఓవర్లలో 91పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ధీర్‌దివాకర్ జట్టు 11.2ఓవర్లలో 92పరుగులు సాధించి గెలుపొందింది. తర్వాత పెద్దపొలమడ జట్టు, వెంకటరమణ లయన్స్ జట్లు తలపడగా.. పెద్దపొలమడ జట్టు 12ఓవర్లలో 98పరుగులు సాధించింది. వెంకటరమణ లయన్స్ 11.5ఓవర్లలో లక్ష్యాన్ని చేధించి విజయం సాధించింది. దీంతో జేసీ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా వెంకటరమణ లయన్స్ జట్టు నిలిచింది. రన్నర్‌గా పెద్దపొలమడ జట్టు నిలిచింది. క్రికెట్ టోర్నమెంట్‌లో బెస్ట్‌బ్యాట్స్‌మెన్‌గా రాజశేఖర్, బెస్ట్‌బౌలర్‌గా ధన, బెస్ట్‌ప్లేయర్‌గా ఎల్లయ్య నిలిచారు. ఆఖరిరోజు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మ్యాచ్‌లను తిలకించారు. అనంతరం విజేతలకు బహుమతులకు అందజేశారు.

విజేత వెంకీ టీం..

ఉరవకొండ: పట్టణంలోని జూనియర్ కళాశాల ఆవరణలో మంత్రి పయ్యావుల కేశవ్ సోదరుల సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. నిర్వహించారు. చివరి రోజున ఫైనల్ మ్యాచ్‌లు ఆసక్తి కరంగా సాగాయి. విన్నర్‌గా వెంకీ టీం, రన్నర్‌గా నరసింహలు టీం నిలిచాయి. మొదటి బహుమతిగా రూ.11,111లు, రెండో బహుమతిగా రూ.5,555 నగదును అందజేశారు. టీడీపీ పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు ఖలందర్, నిరంజన్‌గౌడ్, రామాంజినేయులు, పెద్దన్న, రవి, అనిల్ పాల్గొన్నారు.

ఉద్దేహాళ్‌లో క్రికెట్ పోటీలు


విజేతకు ట్రోఫీ అందజేస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో సంక్రాంతి క్రికెట్ పోటీలు బుధవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు కొత్తపల్లి సతీష్, మున్నా ఆధ్వర్యంలో జరిగాయి. ఈ పోటీల్లో నాలుగు జట్ల క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చూపించారు. ఫైనల్‌గా గెలుపొందిన సూపర్ స్ట్రైకర్స్ విజయ్ టీమ్‌కు టీడీపీ నాయకులు బహుమతిగా కప్‌ను అందజేశారు. నాయకులు కావలి రాము, రవి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఎస్వీ స్మారక అవార్డుల ప్రదానం

గుంతకల్లు టౌన్, జనవరి 15(ఆంధ్రజ్యోతి): రంగస్థల, సినీ నటుడు ఎస్వీ ప్రసాద్‌స్మారక రాష్ట్ర స్థాయి అవార్డులను పట్టణంలోని పలువురు కళాకారులకు ప్రదానం చేశారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఎస్వీ ప్రసాద్‌యాదవ్ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఆమ్లెట్‌మస్తాన్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఎస్వీప్రసాద్‌యాదవ్ ఏపీ, తెలంగాణ,కర్నాటక రాష్ట్రాల్లో వేలాది నాటక ప్రదర్శనలు ఇచ్చి జాతీయ అవార్డులు అందుకున్నారని కొనియాడారు. అనంతరం రంగస్థల నటులు జబీబుల్లా, ఆంథోని, మస్తాన్, గోవిందలకు శాలువ కప్పి పూలమాలతో సత్కరించి ఎస్వీ స్మారక రాష్ట్ర స్థాయి అవార్డులను ప్రదానం చేశారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్‌యాదవ్, మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్టీఆర్ కబడ్డీ పోటీలు


విజేతకు బహుమతి అందజేస్తున్న కాలవ భరత్, మంజునాథ్

బొమ్మనహాళ్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సం దర్భంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూ ల్ మైదానంలో మూడు రోజులుగా జరిగిన మండల స్థాయి ఎన్టీఆర్ కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్ హాజరై మాట్లాడారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకే ఎన్టీఆర్ కబడ్డీ టోర్నమెంట్‌ను పయ్యావుల అనిల్, పయ్యవుల శ్రీకాంత్, నవీన్ నిర్వహించారు అని అన్నారు. పోటీల్లో మండల కేంద్రానికి చెందిన టైటాన్స్ జట్టు మొదటి బహుమతిగా రూ.20,116 గెలిపొందింది. రెండో బహుమతి 10వ బ్యాచ్ రూ.10,116 గెలుపొందింది. ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన చందు వారియర్స్ మూడవ బహుమతిగా రూ.2,116 సాధించారు. కాలవ భరత్, మంజునాథ్ బహుమతులు అందజేశారు. టీడీపీ నాయకులు లాలూస్వామి, రమేష్, జనసేన మండల కన్వీనర్ శివరాజ్ పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన ఎమ్మెల్యే


జస్టిస్ గుణరంజన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

తాడిపత్రి, జనవరి 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మంగళవారం హైకోర్టు జడ్జి జస్టిస్ చల్లా గుణరంజన్‌ను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాడిపత్రికి చెందిన జస్టిస్ గుణరంజన్ హైకోర్టు జడ్జిగా ఉన్నందుకు హర్షం వ్యక్తంచేశారు.

సౌభాగ్యసింధు బాలకల్యాణ ఆశ్రమం సందర్శన

పట్టణంలోని సౌభాగ్యసింధు బాల కల్యాణ ఆశ్రమాన్ని జస్టిస్ చల్లా గుణరంజన్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వహణ, పిల్లల బాగోగులపై ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆశ్రమ స్థలదాత తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. చల్లా గుణరంజన్ రాయలసీమప్రాంతంలో పుట్టి ఎంతో ప్రతిభతో హైకోర్టు జడ్జిగా ఎదగడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రవీంద్ర, వేణుస్వామి, గోపి, చల్లా ప్రసాద్, సుబ్బారెడ్డి, సుబ్రమణ్యం, హనుమంతరెడ్డి, శేషారెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన టెక్ కళాశాల చైర్మన్

జస్టిస్ చల్లా గుణరంజన్‌ను చల్లవారిపల్లి గ్రామంలో బుధవారం టెక్ కళాశాల చైర్మన్ రమేష్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.